ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

• డీఐఈవో సూర్యప్రకాశ్

సిద్దిపేట టౌన్, జనవరి 27: ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయని డీఐఈవో సూర్యప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు మూడు విడతలుగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో సైన్స్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2242 మంది, వొకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 8476, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 7411 మంది ప్రాక్టికల్స్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. జనరల్ వొకేషనల్ గ్రూపులతో కలిపి పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 63 కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను ఆయా కళాశాలల్లో తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు జిల్లా స్థాయిలో హైపవర్ కమిటీని నియమించిందని, ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేసే విషయంలో యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బూరుగుపల్లిలో బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటలోని స్టేడియంలో క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న హరీశ్‌రావు

• మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 27: కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని, పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బూరుగుపల్లి గ్రామానికి చెందిన అంబటి గణేశ్, పట్టణంలోని 17వ వార్డుకు చెందిన మిరుదొడ్డి వెంకటేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరికి పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల చొప్పున ప్రమాదబీమా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కార్యకర్తలు చనిపోతే పార్టీ తరపున రూ.2 లక్షల ప్రమాదబీమా అందజేస్తున్నామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 53 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.కోటీ 6 లక్షల ప్రమాదబీమా చెక్కులు అందజేశామన్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ ఎల్లం, సర్పంచ్ కమలాకర్‌రావు, నాయకులు రామరాజు తదితరులు ఉన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక సామాజిక భవనాలు

ఆత్మగౌరవానికి ప్రతీక సామాజిక భవనాలని, సామాజిక భవనాలకు ఆదర్శం.. మన సిద్దిపేట అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కాల్లకుంట కాలనీలో పద్మశాలీ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలి భవనంలో స్టీల్ సామగ్రి ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో పద్మశాలి భవనాల నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. మరో భవనాన్ని పట్టణంలో కోటి రూపాయలతో నిర్మిస్తున్నామని చెప్పారు. పద్మశాలీ సంఘానికి చెందిన వారు బట్టలు అమ్ముకునేందుకు తన సొంత డబ్బులతో మోటార్ సైకిల్స్ అందించినట్లు తెలిపారు. సమాజం కోసం పాటుపడే వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం హరీశ్‌రావుకు పద్మశాలీ సంఘం సభ్యులు మెమొంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కౌన్సిలర్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిద్దిపేట, జనవరి 27: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ఆచార్య జయశంకర్ స్టేడియంలో డీసీసీబీ ఉద్యోగుల మధ్య క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతిరోజూ బ్యాంకుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి గురవుతున్నారని, ఆటలు ఆడడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వీలు దొరికినప్పుడల్లా ఉద్యోగులు ఆటలు ఆడాలని, దీంతో మానసిక ప్రశాంతత పొందుతారని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. సిద్దిపేట స్టేడియానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఉద్యోగులంతా సిద్దిపేట అభివృద్ధితో పాటు కోమటి చెరువును చూసి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్, నాయకులు పాల సాయిరాం, మేర సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

జెండావిష్కరిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

అపర మేధావి థామస్ ఆల్వా ఎడిసన్

జగదేవ్‌పూర్, జనవరి 27: ప్రపంచంలో చీకట్లను పారద్రోలేందుకు బల్బును కనుగొన్న అపర మేధావి థామస్ ఆల్వా ఎడిసన్ అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం విద్యుత్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల ఎలక్ట్రిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెండావిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఈఎఫ్ సభ్యులు మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, ఎంపీటీసీ కవిత, నాయకులు వెంకట్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జగదేవ్‌పూర్, జనవరి 27 : మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కరుణాకర్ ఇటీవల చెరువులో పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం సర్పంచ్ యాదవరెడ్డి, మండల నాయకులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రంగారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్ ఉన్నారు.

ప్రజలు భగవంతుడిని ఆరాధించాలి

• మాధవానంద సరస్వతీ స్వామీజీ

మిరుదొడ్డి, జనవరి 27: ప్రజలు భగవంతుడిని ఆరాధిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని మాధవానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. శనివారం మిరుదొడ్డి టౌన్ శివారులోని సదానంద సరస్వతీస్వామి ఆశ్రమంలో ఆయన ప్రత్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రజలు ఇతరులపై ఈర్ష్య, ద్వేషాలను వదిలి ప్రేమానురాగాలను చూపాలన్నారు. ప్రజలు నిత్యజీవితంలో సన్మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో పురోహితుడు రాజపున్నయ శర్మ, లక్ష్మీనగర్ మాజీ సర్పంచ్ శివకుమార్, ఆశ్రమం శిష్యబృందం సభ్యులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

అసోసియేషన్ ఏర్పాటు సంతోషకరం

• ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 27: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు కావడం సంతోషకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పట్టణంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొన్న రోజును ఎలక్ట్రీషన్ డే గా జరుపుకొంటామని తెలిపారు. ఉద్యోగికి కష్టాలు వస్తే సంఘం సభ్యులంతా అండగా నిలవాలని సూచించారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం, నిధులు ఇచ్చామని, మిగతా పనులకు తనవంతు సహాయ సహకారం అందిస్తానని తెలిపారు. ఉద్యోగులు పనిలో జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అందుకు అవసరమైతే రిటైర్డ్ ఇంజినీర్స్‌తో శిక్షణ ఇప్పిస్తానని తెలిపారు. ఎలక్ట్రీషియన్స్‌కు ప్రమాద బీమా కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

జిల్లాకు మంచి పేరు తేవాలి

సిద్దిపేట, జనవరి 27: తైక్వాండోలో రాణించి సిద్దిపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మాజీ మంత్రి, తన్నీరు ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. ఇటీవల హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన 37వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి 8 పతకాలు సాధించారు. అండర్-12 విభాగంలో ఆరాధ్య గోల్డ్ మెడల్, వేదాక్షరి, సాత్విక్‌రెడ్డి సిల్వర్ మెడల్స్, హంసిని, మధు, సహస్ర, ప్రణవి, ప్రహ్లాదిక కాంస్య పతకాలు సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన ఆరాధ్య ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు ఛత్తీస్‌గఢ్ రాయపూర్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నది. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను హరీశ్‌రావు అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, తైక్వాండో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణశర్మ, జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ సాయిరాం, సూడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజనర్సు, తైక్వాండో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్, ఐ ప్యాడ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

• ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 27: ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్ నుంచి ఈ ఏడాది 34 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీహెచ్‌లో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్, డిజిటల్ కంటెంట్ పుస్తకాలు, బాసర ట్రిపుల్ ఐటీలో 34 మంది సీట్లు సాధించిన విద్యార్థులకు ఐప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున మీ పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపి చదివించాలని తల్లిదండ్రులను కోరారు. డిజిటల్ స్టడీ కోసం తన సొంత డబ్బులతో విద్యార్థులకు బుక్స్ ఇప్పించానని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సరిగ్గా ఆరేళ్ల క్రితం 300 మంది విద్యార్థులతో సాదాసీదాగా ఉన్న సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల నేడు అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలను పునికిపుచ్చుకొని 1280 మంది విద్యార్థులతో విజయపరంపర సాగిస్తున్నదన్నారు. ఈ పాఠశాల ముఖచిత్రమే మారిపోయిందని, పలు వ్యాపార సంస్థల చేయూతతో విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూములు, ఈ-లైబ్రరీతో పాటు ప్రత్యేక తరగతి గదులను నిర్మించామని తెలిపారు. ఇప్లూ యూనివర్సిటీ ఈ పాఠశాలను దత్తత తీసుకోవడంతో అంతర్జాతీయ భాషలను స్థానిక విద్యార్థులకు అవపాసన పట్టించేలా లాంగ్వేజ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అడ్మిషన్ల కోసం ఎదురుచూసిన పరిస్థితుల నుంచి నో అడ్మిషన్ బోర్డు పెట్టే స్థాయికి ఈ స్కూల్ ఎదిగిందన్నారు. ఈ పాఠశాలంటే తనకు చాలా ఇష్టమని, ఏ కార్యక్రమైనా ఇందిరానగర్ స్కూల్ నుండే ప్రారంభిస్తానన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభకనబర్చిన 150 విద్యార్థులకు ఐప్యాడ్స్ ఇస్తున్నట్లు తెలిపారు. 34 మంది బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించారంటే ఆ ఘనత ఉపాధ్యాయులదేనన్నారు. 10వ తరగతిలో 232 మంది విద్యార్థులు ఉన్న ఏకైక ప్రభుత్వ పాఠశాల ఇందిరానగర్ పాఠశాల అని అన్నారు. నియోజకవర్గంలో పది ఫలితాల్లో విద్యార్థులు వందశాతం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల సాయిరాం, కొండం సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

సిద్దిపేట టౌన్, జనవరి 27 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఇందిరానగర్ పాఠశాలలో 'బాలల హక్కులు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రఘురామ్ మాట్లాడుతూ... విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు తెలిసి ఉండాలన్నారు. అనంతరం రామయ్య స్కూల్‌లో ఉన్న అనాథ పిల్లలకు కోర్టు ఉద్యోగి వంద ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో జడ్జిలు మురళీమోహన్, స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

• ఏసీపీ రమేశ్

గజ్వేల్, జనవరి 27: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ ఆర్థిక నేరాలపై విద్యార్థులు, యువకులు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. శనివారం ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కోసం ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డిజిటల్ సమాజంలో సైబర్ నేరాలు హార్డువేర్, సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్ ద్వారా అతివేగంగా వ్యాపిస్తున్నాయని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కరోనా సమయంలో ప్రజలందరూ ఎక్కువగా ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ విద్యాబోధన, ఉద్యోగస్తులు వర్క్‌ఫ్రం హోం చేయడం, ఆన్‌లైన్ ఆటలు, లోన్ ఆప్స్ ద్వారా సైబర్ నేరాలు అధికంగా జరిగాయన్నారు. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండాలంటే వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చెప్పొద్దన్నారు. ఆశ, అభయం అనే రెండు అంశాలపై సైబర్ నేరస్తులు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఫోన్‌ను వినియోగించే సమయంలో మెస్సేజ్, ఇతర ఫోన్లకు స్పందించొద్దన్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు కూడా సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సైబర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల ట్రెజరర్ రాఘవేందర్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ రాయప్ప, విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న జడ్జి స్వాతిరెడ్డి

సబ్ జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేట టౌన్, జనవరి 27 : సిద్దిపేట సబ్ జైల్‌లో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి జైల్‌లోని 18 నుంచి 22 ఏండ్ల వయస్సున్న ఖైదీలను విచారించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు వైష్ణవి

చేర్యాల, జనవరి 27: మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని పి.వైష్ణవి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఐలయ్య తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైష్ణవిని ఘనంగా సన్మానించారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో వైష్ణవి పాల్గొననుంది. కార్యక్రమంలో సర్పంచ్ రేఖామల్లేశయాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ కోతి దాసు, ఉపాధ్యాయులు, పీఈటీ కవిత పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

గజ్వేల్, జనవరి 27: ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం ప్రజ్ఞాపూర్‌లోని రాణే కంపెనీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టే సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు స్వామి, భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు, మల్లయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గజ్వేల్, జనవరి 27 : పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఇసుక డంపులను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల పక్కనే పొద్దుటూరి నరేందర్‌కు చెందిన కిరాణ దుకాణంపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, నరేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని గజ్వేల్ పోలీసులకు అప్పగించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన అమరనరేందర్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక డంపు నిల్వ చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

ములుగు, జనవరి 27: అనుమానాస్పద మృతి కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శనివారం గజ్వేల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రమేశ్ వివరాలు వెల్లడించారు. ములుగు మండలం బైలంపూర్ గ్రామానికి చెందిన గువ్వ నరేశ్(30) క్షీరసాగర్ గ్రామానికి చెందిన లతతో తొమ్మిదేండ్ల క్రితం వివాహమైంది. చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన భువనేశ్వర్‌తో లత వివాహేతర సంబంధం పెట్టుకుంది. వారి అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తొలిగించుకోవాలని ప్రియుడు భువనేశ్వర్‌తో కలిసి లత హత్యాయత్నానికి కుట్ర పన్నింది. గురువారం రాత్రి నరేశ్ నిద్రిస్తున్న సమయంలో లత ఆమె ప్రియుడు భువనేశ్వర్‌తో కలిసి నరేశ్ గొంతు నులిమి హతమార్చి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించారు. మృతుడి తండ్రి మల్లేశ్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు మృతుడి భార్యను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లోనే కేసును ఛేదించిన గజ్వేల్ రూరల్ సీఐ జానకీరామ్, ములుగు ఎస్సై విజయ్‌కుమార్‌ను ఏసీపీ అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965. NTW-323058

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899. NT-319424-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పాలకేంద్రంలో 'గోల్‌మాల్' నిజమే

• రూ.4 లక్షలు సొంత అవసరాలకు వాడుకున్న చైర్మన్
• రెండు నెలల్లో తిరిగి చెల్లిస్తానని ఒప్పంద పత్రంలో హామీ

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ప్రత్యేక సమావేశంలో పాలకేంద్రం లెక్కలపై విచారణ చేస్తున్న గ్రామ పెద్దలు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 27: లద్నూర్ పాలకేంద్రంలో అక్రమాలు జరుగుతున్నాయని ఈనెల 24న 'పాల కేంద్రంలో గోల్‌మాల్' అనే పేరుతో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురించిన కథనానికి విజయ పాలకేంద్రం పాలకవర్గం, అధికారులు స్పందించారు. శనివారం గ్రామ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, పాలకవర్గ సభ్యులు, పాడిరైతులు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 2016 నుంచి ఇప్పటి వరకు పాలకేంద్రంలో జరిగిన లావాదేవీలపై విచారణ జరిపారు. ప్రతినెలా రైతులకు పంచాల్సిన బిల్లులు పోను సంఘానికి వచ్చిన రూ.4 లక్షలను విజయ పాల కేంద్రం చైర్మన్ ఖాజాహిదాయితుల్లా తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు బయటపడింది. లాభాల డబ్బులను తన సొంత అవసరాలకు వాడుకున్నది నిజమేనని చైర్మన్ ఒప్పుకున్నారు. రూ.4 లక్షల డబ్బులను రెండు నెలల వ్యవధిలో సంఘానికి చెల్లిస్తానని సంఘం వేతన కార్యదర్శి కూరెళ్ల బుచ్చిరాములుకు హామీ పత్రాన్ని అందజేశారు. కాగా, ప్రస్తుతమున్న పాలకవర్గాన్ని వెంటనే మార్చాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. దీంతో కొత్త పాలకవర్గ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, మాజీ సర్పంచులు రామడుగు బాలరాజు, జీడికంటి సురేశ్, నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, దాసరి పద్మారెడ్డి, మల్లారపు రాజు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మల్లన్న క్షేత్రాభివృద్ధికి కృషి చేయండి

• 120 కాటేజీల నిర్మాణానికి మంత్రి సుముఖత
• మంత్రి కొండా సురేఖను కలిసిన ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు

చేర్యాల, జనవరి 27: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి కోరారు. శనివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిటీ చైర్మన్ మాట్లాడుతూ జాతర సందర్భంగా పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయం వరకు ఎలక్ట్రిక్ ఆటోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే దాతల సహకారంతో 120 కాటేజీల సముదాయాన్ని నిర్మించేందుకు సహకరించాలని మంత్రిని కోరడంతో ఆమె సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు చెప్పారు. మంత్రి సురేఖ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి సహకారంతో క్షేత్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు అల్లం శ్రీనివాస్, దామోదర్, రమేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్, మహాదేవుని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.